## క్లుప్తంగా

### లైసెన్స్ తప్పనిసరి



రాయపర్తి : వ్యాపారస్తులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని డివిజనల్ పంచాయతీ అధికారి (డీపీఓ) వేదవతి స్పష్టం చేశారు. మండల కేంద్రంలో పలువురు వ్యాపారులకు ఆమె శుక్రవారం అవగాహన కల్పించారు. లైసెన్స్ కలిగి ఉండడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. లైసెన్స్ తీసుకోకుండా వ్యాపారం చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని చెప్పారు. వ్యాపారస్తులు తప్పనిసరిగా సంబంధిత శాఖల నుంచి లైసెన్స్ పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ కూచన ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శి వల్లె వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఖానాపురం : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సబ్‌యూనిట్ ఆఫీసర్ నంద కోరారు. మండలంలోనిత బుధరావుపేట, కొత్తిమాటుతండా గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. నీటి గుంతలున్న చోట టీమోఫాస్ మందు పిచికారీ చేయించారు. అనంతరం నంద మాట్లాడారు. ప్రజలు దోమతెరలు వినియోగించాలని సూచించారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ దామోదర్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు జ్యోతి, వినోద, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

### జల్సాలకు అలవాటుపడి చోరీలు

ఆత్మకూరు : జల్సాలకు అలవాటు పడి ఇద్దరు యువకులు, ఓ బాలుడు చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కారు. ఆత్మకూరు పోలీసులు నిందితులను అరెస్ట్ చేయగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ సతీశ్‌బాబు మీడియాకు వివరాలు వెల్లడించారు. కటాక్షపూర్ చెక్‌పోస్ట్ వద్ద అనుమానాస్పదంగా బైక్‌పై వెళ్తున్న హనుమకొండ గోపాల్‌పూర్‌కు చెందిన పాశం ప్రణీత్, సాయితోపాటు ఇంటర్ చదువుతున్న బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. ముగ్గురూ మండలంలోని గుడెప్పాడ్‌లోని రామాలయంలో జూన్‌లో వెయ్యి రూపాయల నగదుతోపాటు వెండి యజ్ఞోపవీతం, రెండు బండారు పుస్తెలు చోరీ చేశారన్నారు. అలాగే దుగ్గొండి మండలంలోని గిర్నిబావి వైన్‌షాపులో రూ.12వేల నగదుతోపాటు మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లారని తెలిపారు. నిందితుల నుంచి బంగారం, నగదు రికవర్ చేసి బైక్‌ను సీజ్ చేసినట్లు వివరించారు. అలాగే సాయి పరారీలో ఉన్నాడని తెలిపారు. సమావేశంలో సీఐ సంతోశ్, ఎస్సైలు తిరుపతి, సతీశ్, సిబ్బంది కుమారస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### అవగాహన సదస్సు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్స్ (బిప్స్) కళాశాలలో పీసీఐ, ఐడీఎంఏ సహకారంతో జాతీయ కరెంట్ గూడ్స్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ప్రాక్టీస్ (సీజీఎంపీ) అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పుట్ట రవి ప్రసంగించారు. డ్రగ్స్ తయారీ విధానంలో ఉత్తమ పద్ధతులు, నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, విభాగాధిపతులు మనీశ్‌కుమార్, రవి, తదితరులు పాల్గొన్నారు.

### మొరం టిప్పర్ల సీజ్

సంగెం : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై వంశీకృష్ణ కథనం ప్రకారం.. పోలీసులు గురువారం రాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా మండలంలోని తీగరాజుపల్లి శివారులో రెండు టిప్పర్లు ప్రభుత్వ అనుమతి లేకుండా మొరం తరలిస్తూ పోలీసులకు చిక్కాయి. దీంతో టిప్పర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### పరామర్శ

పర్వతగిరి : మండలంలోని కల్లెడకు చెందిన బాల్య వెంకటయ్య గురువారం గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం పరామర్శించారు. వెంకటయ్య అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించారు. అలాగే ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు మద్దెల శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, సొసైటీ చైర్మన్ మనోజ్ గౌడ్, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రాజు, మాజీ సర్పంచ్‌లు పరమేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీలో వైద్యం నామమాత్రమే

- సాయంత్రం 4 గంటలకే తాళం

నల్లబెల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో వైద్యసేవలు నామమాత్రంగానే అందుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాయంత్రం 4 గంటలకు పీహెచ్‌సీకి తాళం వేస్తుండడంతో రాత్రి అనారోగ్యానికి గురైతే నర్సంపేట, ములుగు, వరంగల్‌లోని ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. పీహెచ్‌సీలో 24 గంటలూ వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉండగా, స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలోని సుమారు 27,500పైగా జనాభా ఉన్నారు. ఈ ఆస్పత్రికి అనుసంధానంగా నల్లబెల్లి, లెంకాలపల్లి, రేలకుంట, ముచ్చింపుల, కన్నారువుపేట, గోవిందాపూర్ గ్రామాల్లో ఉపప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. స్థానిక పీహెచ్‌సీల్లో ప్రతిరోజూ సుమారు 70 మందికిపైగా ఓపీలో వైద్య సేవలు పొందుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఆస్పత్రి పరిధిలోని గ్రామాలకు చెందిన రోగులు, గర్భిణులు చికిత్స పొందుతున్నారు.



రాత్రి వేళల్లో అనారోగ్యానికి గురైనా, ప్రమాదాల బారిన పడినా వైద్యం కోసం నర్సంపేట, ములుగు, వరంగల్ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేసి 24 గంటల వైద్యసేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు జిల్లా వైద్యశాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**సాయంత్రం నాలుగు గంటల వరకే..**

స్థానిక పీహెచ్‌సీలో ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మాత్రమే వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. అది కూడా స్వల్ప అనారోగ్యానికి ప్రాథమిక వైద్యసేవలు మాత్రమే అందిస్తున్నారు. ప్రసవాలు, ఇతర ఏమైనా సమస్యలు, రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటే బాధితులకు చికిత్స అందించేందుకు ఇక్కడ సదుపాయాలు లేవు.

### ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలి



పీహెచ్‌సీలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే వైద్యం అందుతోంది. రాత్రి సమయంలో ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో నర్సంపేట, ములుగు, వరంగల్ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం, వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసి 24 గంటలపాటు వైద్య సేవలు అందేలా చూడాలి.

– జి.శ్రీనివాస్ గుప్తా, సామాజిక సేవా కార్యకర్త

# పౌష్టికాహారంతో ఆరోగ్య పరిరక్షణ



రాయపర్తి : చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ, సూపర్‌వైజర్లు

- సీడీపీఓ డెబోరా

రాయపర్తి : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఐసీడీఎస్ వర్ధన్నపేట సీడీపీఓ డెబోరా కోరారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం, సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ డెబోరా హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ పౌష్టికాహారంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, మాధవీలత, చంద్రకళ, లలిత, బ్లాక్ కోఆర్డినేటర్ అనిత, అంగన్‌వాడీ టీచర్లు ఐత కృష్ణవేణి, ఐత విజయరాణి, చంద్రకళ, శశిరేఖ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

**చెన్నారావుపేట మండలంలో..**

నర్సంపేట రూరల్ : చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రసాన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నూనె కవిత, కూనమల్ల స్వరూప, భూక్య సరిత, ఆయాలు పెండ్యాల జ్యోతి, మాలోతు జ్యోతి, ఆగమ్మ, ఆశా కార్యకర్త చీనమ్మ, మహమ్మద్ రహీమున్నీసా బేగం, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్ : చిన్నారికి అన్నప్రాసన చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు

# బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

- బీజేపీ ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు గుణపాఠం చెప్పాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కోరారు. మండలంలోని రాజుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని చింతగడ్డ తండాకు చెందిన భూక్య సౌందర్య బీజేపీలో శుక్రవారం చేరగా ఆమె రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు తనుగుల అంబేడ్కర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను మోసపూరిత పార్టీలుగా అభివర్ణించారు. బీజేపీతోనే ప్రజలకు మెరుగైన పాలన అందుతుందని చెప్పారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ దుంకదువ్వ రంజిత్, మండల ప్రధాన కార్యదర్శులు తాళ్లపెల్లి రాము, బట్టు మదన్, ఉపాధ్యక్షుడు బోయిని సుధాకర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, నియోజకవర్గ కన్వీనర్ ఆముదాల రమేశ్, మనీశ్, మండల అధ్యక్షుడు వీరన్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

### మానసిక ఆరోగ్య దినోత్సవం



వర్ధన్నపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. కళాశాల హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో 'ద ఇంపాక్ట్ ఆఫ్ హెల్త్ ఇష్యూస్ ఆన్ స్టూడెంట్ మెంటల్ హెల్త్' అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోషయ్య మాట్లాడారు. సోషల్ మీడియాను సరైన రీతిలో వినియోగించుకుని బంగారు భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజు, హెల్త్ క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ సంధ్య, సభ్యులు స్నేహలతరెడ్డి, డాక్టర్ విష్ణుకుమార్, డాక్టర్ రజిత, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ సంపత్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సుధారాణి, డాక్టర్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

- సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శోభారాణి

వర్ధన్నపేట : మహిళలకు హక్కులు, చట్టాలపై అవగాహన అవసరమని సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శోభారాణి తెలిపారు. మండలంలోని చెన్నారంలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళ, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల శాఖ ఆధ్వర్యంలో సఖి సెంటర్లు పని చేస్తున్నాయని చెప్పారు. మహిళలకు, వృద్ధులకు, పిల్లలకు అందించే సేవలపై వివరించారు. మహిళల, బాలికల రక్షణ, భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి సెంటర్లను ఏర్పాటు చేశాయన్నారు. బాధిత మహిళలకు కౌన్సిలింగ్ చేయడంతోపాటు తాత్కాలిక వసతి, తదితర అనేక సేవలు అందుతాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రాలేని మహిళలు హెల్ప్‌లైన్ 181కు కాల్ చేసి సాయం పొందాలని సూచించారు. ఆపదలో ఉన్న బాలలను రక్షించడానికి చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 అందుబాటులో ఉందన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పోక్సో, తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళలు, బాలలు, వృద్ధులకు అందిస్తున్న సేవలపై ముద్రించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీసీ రమాదేవి, బీటీఏ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్లను ప్రదర్శిస్తున్న శోభారాణి, తదితరులు

### విద్యార్థుల ప్రతిభ



రాయపర్తి : జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి సదరన్ సైన్స్ డ్రామా పోటీల్లో మండలంలోని కొలన్‌పల్లి ప్రభుత్వ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. పరిశుభ్రత అంశంపై నాటిక ప్రదర్శించి తృతీయ స్థాయి బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా స్వీయ రచన, దర్శకత్వం వహించి గైడ్ టీచర్‌గా వ్యవహరించిన బయాలజీ సైన్స్ ఉపాధ్యాయుడు చక్రవర్తుల నాగార్జునరావు, విద్యార్థులను హెచ్‌ఎం రఘురాం అభినందించారు.

# సహ చట్టంపై అవగాహనే లక్ష్యం



నర్సంపేట రూరల్ : మాట్లాడుతున్న ప్రణీత్



ఖానాపురం : వ్యాస రచన పోటీలో విద్యార్థులు

- జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్

నర్సంపేట రూరల్: సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ)పై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సమాచార హక్కు రక్షణ చట్టం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కల్లెపు ప్రణీత్ తెలిపారు. మండలంలోని ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో సమాచార హక్కు రక్షణ చట్టం సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చట్టం అమల్లోకి వచ్చి 12 ఏళ్లు అవుతోందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తేజావత్ జయ, ఉపాధ్యాయులు సునీత, శశిధర్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సదానందం, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ పరాచికపు సదానందం ఆధ్వర్యంలో విద్యార్థులకు సహ చట్టంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సదానందం, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ పరాచికపు సదానందం మాట్లాడారు. హక్కులపై విద్యార్థులు విద్యార్థి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు విజయ్‌కుమార్, తిరుపతమ్మ, శోభ, నాగశ్రీ, అనిల్, కేశవరెడ్డి, సంజీవ, రాజేశ్, రవికుమార్, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- మాజీ జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు

గీసుకొండ : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు తెలిపారు. మండలంలోని కొనాయమాకులలో బీఆర్‌ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ బాకీ కార్డును ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చల్లా వేణుగోపాల్, నాయకులు బోడకుంట్ల ప్రకాశ్, పూండ్రు జయపాల్‌రెడ్డి, సిరిసె శ్రీకాంత్, ముంత రాజయ్య, గుర్రం రఘు, కోట ప్రమోద్, ధనుంజయ్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.



బాకీ కార్డులను పంపిణీ చేస్తున్న ధర్మారావు

### డయాబెటిక్ వైద్యశిబిరం



రాయపర్తి : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ వర్ధన్నపేట ఆధ్వర్యంలో లయన్ పీడీజీ ముచ్చ రాజిరెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం ఉచిత డయాబెటిక్ వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ జెడ్‌సీ మల్లెల రంగారావు, ప్రెసిడెంట్ బుద్ధ సునీల్, సెక్రటరీ గారె నర్సయ్య, ట్రెజరర్ కంది ప్రభాకర్, మెంబర్ వేణు, ఏఎన్‌ఎంలు జయలత తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై అగ్రకులాల కుట్ర



నర్సంపేట : నిరసన తెలుపుతున్న సారయ్య, నాయకులు

- సంఘం జిల్లా అధ్యక్షుడు సారయ్య

నర్సంపేట : బీసీ రిజర్వేషన్‌పై అగ్రకులాలు కుట్ర చేస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సోల్తి సారయ్య తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలపై కోర్టు స్టే ఇచ్చిన క్రమంలో ఆ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి మల్లేశం ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను బీసీలు వ్యతిరేకించలేదని గుర్తు చేశారు. కోర్టులకు వెళ్లలేదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సోల్తి రవి, పట్టణ అధ్యక్షుడు గండు రవి, ఉపాధ్యక్షుడు చీర వెంకట్‌నారాయణ, నాయకులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండల కేంద్రంలో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింద కుమారస్వామి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్‌పై అగ్రకులాల కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వైనాల వీరస్వామి, సీపీఐ మండల కన్వీనర్ కడియాల క్రాంతి కుమార్, నాయకులు కోల లింగయ్య, మామిండ్ల పెద్ద ఐలయ్య, రమేశ్, నారాయణస్వామి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నల్లబెల్లి : నిరసన తెలుపుతున్న నాయకులు

# చదువులో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థినులకు శానిటరీ కిట్లు పంపిణీ చేస్తున్న కోటేశ్వర్‌రావు, తదితరులు

- రోటరీ క్లబ్ చైర్మన్ కోటేశ్వర్‌రావు

ఖానాపురం : విద్యార్థులు చదువులో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రోటరీ క్లబ్ క్యాన్సర్ అవేర్నెస్ ప్రోగ్రామ్ జోనల్ చైర్మన్ ఐరుకు కోటేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని ఐనపల్లిలోని మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల స్కూల్‌లో విద్యార్థినులకు క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం శానిటరీ కిట్లు పంపిణీ చేశారు. తొలుత డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వర్‌రావు మాట్లాడారు. ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై శ్రద్ధ పెట్టగలరని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రంజిత్, సెక్రటరీ శ్రీరాం కిరణ్, చకిలం కృష్ణమూర్తి, గుడిపూడి పవన్‌కుమార్, స్కూల్ ప్రిన్సిపాల్ అనిత, నర్సింగ్ ఆఫీసర్ శిరీష, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### వాటర్ ప్లాంట్ పనుల పరిశీలన



రాయపర్తి : మండలంలోని జయరాంతండా(ఎస్)లో వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులను ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ప్లాంట్ గది నిర్మాణానికి ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఐత జంపి, తదితరులు పాల్గొన్నారు.

# సీజేఐపై దాడికి యత్నం అమానుషం

నర్సంపేట : భారతదేశ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించడం అమానుషమని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. జస్టిస్ గవాయ్‌పై దాడిని అనాగరిక చర్యగా అభివర్ణించారు. హిందుత్వ శక్తుల ప్రోద్బలంతో దేశంలో దుర్ఘటనలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. నిందితుడిని చట్టరీత్యా కఠినంగా శిక్షించి భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు, నాయకులు ధార లింగయ్య, మాడా అశోక్, కత్తుల కొమురయ్య, సింగనబోయిన కట్టయ్య, నాయకులు గట్టికొప్పుల రవి, సుధాకర్, రవి, జంపయ్య, వెంకన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.

### ఐక్యతతో రాణించాలి

నెక్కొండ : మున్నూరు కాపు కులస్తులు ఐక్యతతో అన్ని రంగాల్లో రాణించాలని మున్నూరుకాపు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మాదాసు రవి కోరారు. స్థానిక సంఘం భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణానికి పలువురు సాయం అందించారని చెప్పారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు కోల జనార్దన్, ప్రధాన కార్యదర్శి పదాల రవికుమార్, ఉపాధ్యక్షుడు యాసం కుమారస్వామి, కోశాధికారి బొల్లం రాములు, సహాయ కార్యదర్శి ఎడ్ల సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

### మత ప్రచారంపై విచారణ

వర్ధన్నపేట : పట్టణంలోని పుస్కోస్ స్కూల్ మత ప్రచారంపై ఎంఈఓ శ్రీధర్ శుక్రవారం విచారణ చేపట్టారు. స్కూల్‌లో మత ప్రచారం చేస్తున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అయిన క్రమంలో ఏబీవీపీ నాయకులు ఫిర్యాదు చేయగా డీఈఓ ఆదేశాల మేరకు ఎంఈఓ విచారణ చేశారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు.

### ప్రైవేట్‌పరం చేయొద్దు

నర్సంపేట : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును ప్రైవేటు పరం చేయొద్దని ఐఎఫ్‌టీయూ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బరిగెల కుమార్, గొర్రె ప్రదీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పగించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ కార్మిక సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పగిస్తే కార్మికులకు ఇబ్బందులు తప్పవన్నారు. కార్మికులకు పని ప్రదేశాల్లో భద్రత లేదని చెప్పారు. అడ్డాల వద్ద తాగునీటి, ఇతర సదుపాయాల కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 15న హైదరాబాద్‌లోని సంక్షేమ బోర్డు ఎదుట ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చెన్నమల మొగిలి, పెసరు కుమారస్వామి, కుసుమ రాజేందర్, కదిరిక మల్లయ్య, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

### నైపుణ్యాలతో మెరుగైన ఉద్యోగాలు



ఎస్సై సాయిబాబును సన్మానిస్తున్న ప్రతినిధులు

వర్ధన్నపేట : నైపుణ్యాలు పెంచుకుంటే మెరుగైన ఉద్యోగాలు లభిస్తాయని ఎస్సై సాయిబాబు తెలిపారు. యువ పరివర్తన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు ఆయన హాజరై ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. యువత విద్యార్హతలతోపాటు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ అలవర్చుకోవాలని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు జాబ్ మేళాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. యువత అవకాశాలను వినియోగించుకుని ఎదగాలని కోరారు. అనంతరం ఫౌండేషన్ ప్రతినిధులు ఎస్సై సాయిబాబును సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు నరేశ్, బెల్లంకొండ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.